
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5





పెళ్లి మాటున పచ్చి మోసం

స్థానికంగా దొరకని వధువులు.. ఇతర ప్రాంతాలకెళ్లి తెచ్చుకుంటున్న యువకులు

- మధ్యవర్తులు, అమ్మాయికి లక్షల్లో ఇచ్చుకుంటున్న దుస్థితి
- కొన్నాళ్లకే ఎస్కేప్ అవుతున్న వధువు
- డబ్బు పోగొట్టుకుని యువకులు లబోదిబో
- బాధితుల్లో రైతు బిడ్డలే అధికం



హిందూపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సంప్రదాయమైన కుటుంబమే. రైతుబిడ్డ కావడంతో 40 ఏళ్ల వయసు వచ్చినా పెళ్లికా లేదు. తల్లిదండ్రులకు వయసు మీద పడటంతో ఎలాగైనా వారు ఉన్నపుడే పెళ్లి చేసుకుందా మని ఆ యువకుడు భావించాడు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో పెళ్లిళ్ల పేరయ్యను ఆశ్రయిం చాడు. పెళ్లి కావాలంటే రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందని ఆ పేరయ్య చెప్పాడు. దీంతో ఆ రైతు బిడ్డ ఎంత ఖర్చయినా పర్వాలే దనీ, పెళ్లి కుదిరితే చాలని ఒప్పుకున్నాడు. భీమ వరానికి వెళ్లి అక్కడ కొంతమంది యువతు లను చూపించాడు. అందులో ఒక యువతిని ఒప్పుకున్నాడు. వెంటనే తల్లిదండ్రులు వృద్ధులు కావడంతో వారికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి ఆలయం వద్ద పెళ్లి చేసుకున్నాడు. మధ్యవర్తి చెప్పిన విధంగా అమ్మాయికి, పెళ్లి కుదుర్చిన వారికి సుమారు రూ.4 లక్షలు ఖర్చు చేశాడు. పెళ్లి అయిన వెంటనే స్వగ్రామానికి తీసుకొచ్చాడు. వారం రోజులు భర్తతో అన్యోన్యంగా ఉంది ఆ అద్దె భార్య. తరువాత తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగోలేదని తను వెళ్లాలంటూ భర్తకు చెప్పింది. పెళ్లి సమయంలో తనకు తల్లిదండ్రులు లేరని చెప్పి ఇప్పుడు ఉన్నారని అంటున్నావని భర్త నిలదీశాడు. తల్లిదండ్రులు లేరని ఎవరు చెప్పారనీ, తనను పుట్టింటికి పంపకపోతే ఆత్మ హత్య చేసుకుంటానని ఆ యువతి బెదిరించింది. దీంతో చేసేదిలేక తీసుకెళ్లాడు. భీమవరం ప్రాంతంలోని రైల్వేస్టేషన్ వద్దకు చేరుకోగానే తాను ఒక్కతే ఇంటికి వెళతాననీ, ఊరికి వెళ్లాలని చెప్పింది. తానూ వస్తానని భర్త అన్నాడు. తన కుటుంబ సభ్యులు ఏదైనా చేయవచ్చని చెప్పి వెళ్లిపోయింది. ఆ తరువాత భర్త ఫోన్ నంబర్లను బ్లాక్ చేసింది. కొన్నిరోజుల తరువాత మోసపోయానని గ్రహించిన యువకుడు పోలీసులను ఆశ్రయించాడు.



వ్యవసాయాధారిత దేశంలో
రైతుకే విలువ లేకుండా పోతోంది..
సేద్యం చేసే యువరైతుకు
పిల్లనిచ్చేవారులేరు..
వివాహం కానివారు ఊరూరా ఉన్నారు..
వయసు మీరిపోతోంది..
తల్లిదండ్రులు ముసలివాళ్లవుతున్నారు..
వారికి వండిపెట్టేవారు లేరు..
బాగోగులు చూసుకునేవారు లేరు..
ఎక్కడికెళ్లినా పెళ్లి చర్చే..
బంధువుల ఇళ్లకు, శుభకార్యాలకు
వెళ్లలేని దుస్థితి..
వీటితో విసిగి వేసారిన రైతు బిడ్డలు..
కులం వద్దు.. గోత్రం వద్దు..
ఎవ్వరైనా.. ఏ ఊరైనా..
అమ్మాయైతే చాలు..
పెళ్లి చేసుకుంటామని
ముందుకొస్తున్నారు..
పెళ్లిళ్ల పేరయ్యలను ఆశ్రయిస్తున్నారు..
కోస్తా, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకెళ్లి..
ముక్కు, మొహం తెలియని
అమ్మాయిలను తెచ్చుకుంటున్నారు..
పెళ్లి చేసుకుంటున్నారు..
పేరయ్యలకు, వధువుకు కూడా..
రూ.లక్షల్లో ఇచ్చుకుంటున్నారు..
రోజులు గడుస్తాయో.. లేదో..
ఆ వధువు ఎస్కేప్ అవుతుంది..
పెళ్లి పెటాకులవుతుంది..
పేరయ్యలు చేతులెత్తేస్తారు..
డబ్బూ పాయె.. పరువూ పాయె..
దీనిని అవమానంగా భావించి..
బాధితులు ఊరు వదులుతున్నారు..
కొందరు పోలీసులను ఆశ్రయిస్తున్నారు..
ఇది.. ప్రస్తుతం పెళ్లి మాటున
చేస్తున్న పచ్చి మోసం..
పెళ్లికాని ప్రసాద్‌లూ.. జర జాగ్రత్త..

హిందూపురం మండలంలోని మరో గ్రామానికి చెందిన ఓ యువకుడు తూముకుంట పారిశ్రామిక వాడలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. 35 ఏళ్ల దాటినా వివాహం కాకపోవడంతో మధ్యవర్తులతో కలిసి రాజమండ్రికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. 15 రోజులు కాపురం చేశాక భర్త, అత్త మామలకు చెప్పకుండానే ఆ యువతి వెళ్లిపోయింది. భర్త.. రాజమండ్రిలో పెళ్లి చేసిన మధ్యవర్తులకు ఫోన్ చేసి సంప్రదించగా... వారు పెళ్లి చేసేవరకే తమ బాధ్యత అంటూ ఆ తరువాత తమకు సంబంధంలేదని చేతులెత్తేశారు. దీంతో చేసేది లేక ఆ యువకుడు మిన్నకుండిపోయాడు.

ధర్మవరం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు అనంతపురం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ద్వారా రాజమండ్రి ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయిని వివాహం చేసుకొచ్చాడు. అమ్మాయి అందంగా ఉందని ఆమె కోసం అబ్బాయి రూ.7 లక్షల వరకు ఖర్చు చేసుకున్నాడు. పెళ్లై నెల తిరక్కుండానే అమ్మాయి వెళ్లిపోవడంతో ఆ యువకుడు పెళ్లి చేసిన మధ్యవర్తులను ఆశ్రయించాడు. వారిలో కొంతమంది మధ్యవర్తులు ఒకటి, రెండు సార్లు స్పందించి ఆ తరువాత అందుబాటులోకి రాలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదు చేసి, పెళ్లి చేసిన మధ్యవర్తులను పిలిపించి, ఖర్చుచేసిన మొత్తంలో సగం మొత్తాన్ని ఆ యువకుడికి ఇప్పించినట్లు తెలిసింది.

కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఓ యువకుడికి 40 ఏళ్ల దాటినా వివాహం కాకపోవడంతో అనంతపురంలో పెళ్లిళ్ల పేరయ్యను ఆశ్రయించాడు. అతడితో రూ.లక్ష వరకు ఖర్చు చేయించి, కర్ణాటకలోని గుల్బర్గా ప్రాంతానికి చెందిన అమ్మాయితో వివాహం చేయించారు. ఇందుకుగాను ఆ యువకుడు రూ.15 లక్షల వరకు ఖర్చు చేసుకున్నాడు. పెళ్లైన 15రోజులకు అమ్మాయి పుట్టింటికి వెళ్లిపోవడంతో ఆ యువకుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. కర్ణాటకకు చెందినవారు కావడంతో అక్కడికి వెళ్లి వారిని తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఈ నలుగురే కాదు. ఇలాంటివారు ఇటీవల కాలంలో చాలామందే మోసపోతున్నారు. బాధితుల్లో చాలావరకు రైతుబిడ్డలే ఉండటం శోచనీయం. ఒకప్పుడు రైతు కుటుంబానికి అమ్మాయిని ఇచ్చేందుకు పోటీపడేవారు. వ్యవసాయం పరిస్థితి రోజురోజుకీ దిగజారిపోతుండడంతో రైతు బిడ్డలకు అమ్మాయిలు దొరకడం కష్టతరంగా మారింది.



హిందూపురం, అక్టోబరు 2: ఇటీవల కాలంలో అద్దె పెళ్లిళ్లు అధికమయ్యాయి. జిల్లాలో అధిక శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పల్లెల్లో కొద్దిమంది మాత్రమే ఉన్నత చదువులు చదివి, పెళ్లిల్లు చేసుకుంటున్నారు. వ్యవసాయాన్ని నమ్ముకుని తల్లితండ్రుల బాటలో వారికి చేదోడువాదోడుగా ఉంటున్న చాలామందికి అమ్మాయిలు దొరకడం లేదు. ఈ ప్రాంతంలోని యువకులు కులం, గోత్రంతో సంబంధం లేకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లి పెళ్లిళ్ల పేరయ్యలు చెప్పిన విధంగా వివాహం చేసుకుంటున్నారు. అక్కడే దారుణంగా మోసపోతున్నారు. రోజులు తిరక్కుండానే వధువు వెళ్లిపోతోంది. డబ్బు, పరువు పోయిందంటూ బాధితుడు లబోదిబోమంటున్నాడు. ఇటీవల ఇటువంటి బాధితుల సంఖ్య పెరుగుతున్నట్లు పోలీసుల ద్వారా తెలుస్తోంది.

సొమ్మూ పాయె.. పెళ్లామూ పాయె..

సినీఫక్కీలో పెళ్లిళ్లు పెటాకులవుతుండడంతో చాలామంది యువకులు తీవ్ర మనస్తాపం చెందుతున్నారు. పెళ్లి చేసుకుని గ్రామానికి వచ్చిన యువకుడికి నెల తిరక్కుండానే పెళ్లాం వెళ్లిపోవడంతో అవమానంగా భావిస్తున్నారు. దీంతో చాలామంది యువకులు సొంతూళ్లకు దూరమై వేరే గ్రామాలకు వెళ్తున్నారు. ఈ పరిస్థితుల్లో సొమ్ము పాయె.. పెళ్లాం కూడా పాయెనని నిట్టూరుస్తున్నారు.

అమ్మాయి బంధువులే.. మధ్యవర్తులు..

అమ్మాయి తరపున పెళ్లి కుదిర్చిన మధ్యవర్తులే ఆమె బంధువులుగా మారి పెళ్లి చేస్తున్నారు. ఇటీవల హిందూపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడికి పెళ్లి జరిగినపుడు అమ్మాయికి తల్లిదండ్రులు లేరని చెప్పారు. అమ్మాయికి చెల్లి, అక్క, పెద్దమ్మ అని చెప్పి సినిమా తరహాలో పెళ్లి చేయించారు. ఇప్పుడు వారితో మాట్లాడితే తమకు, ఆ అమ్మాయికి సంబంధమే లేదని చేతులెత్తేస్తున్నారు. ఆధార్‌లో ఒక పేరు, పెళ్లి సమయంలో మరోపేరు చెబుతూ యువకులను మోసగిస్తున్నారు. ఇదంతా సినిమా తరహాలో జరుగుతోందంటే అతిశయోక్తి కాదు. అంతేకాదు, అమ్మాయిలు వెళ్లిపోతూ.. నగలు, డబ్బులు కూడా తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి మోసాల పట్ల యువకులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పోలీసు వర్గాలు సూచిస్తున్నాయి.



గాంధీజీ ఆశయ సాధనకు కృషిచేద్దాం

మంత్రి సవిత



చీపురుపట్టి రోడ్లు ఊడుస్తున్న మంత్రి సవిత తదితరులు

పెనుకొండ/పెనుకొండ టౌన్, అక్టోబరు 2: గ్రామస్వరాజ్యం కోసం మహాత్మగాంధీ కన్న కలల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రధాన సర్కిల్‌లోని మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి, మంత్రి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక నాయకులు, నగర పంచాయతీ కార్మికులతో కలిసి స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మార్కెట్ సమీపంలో మంత్రి సవిత.. కార్మికులతో కలిసి చీపురుపట్టి రోడ్లు ఊడ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వీధులు బాగుంటే కాలనీలు శుభ్రంగా ఉంటాయన్నారు. కాలనీలు బాగుంటేనే ఊరు, దేశం బాగుంటుందన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించిరోడ్డుపై వచ్చిన కార్మికుల సేవలు అభినందనీయమన్నారు. 30 మంది నగర పంచాయతీ కార్మికులకు మంత్రి స్వగృహంలో బహుమతులు అందించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..



బాపూ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి: స్థానిక కలెక్టరేట్‌లో మహాత్ముడి జయంత వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి కలెక్టర్ టీఎస్ చేతన్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రవి అస్తమించని సామ్రాజ్యాన్ని స్థాపించిన బ్రిటీష వారిని అహింస అనే ఆయుధంతో బాపూజీ తరిమికొట్టారన్నారు. మహాత్ముడు చూపిన మార్గం నేటి యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య పాల్గొన్నారు.

డీపీఓలో..



మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్: జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్పీ రత్న.. మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. మహాత్ముడి త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేటురెడ్డీ.. నీ గుట్టు విప్పుతా..

మంత్రి సత్యకుమార్ ట్వీట్

ధర్మవరం, అక్టోబరు 2: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎక్స్ (గతంలో ట్విట్టర్) ద్వారా బుధవారం ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు. 'కబ్జా, కమీషన్, కలెక్షన్, కరప్షన్‌కు కేరాఫ్ అడ్రస్ కేటురెడ్డి. కమీషన్లు లేక మైండ్ బ్లాక్ అయినట్లు ఉంది. కాస్తా ఓపిక పడితే కేతిరెడ్డి, అతడి రౌడీమూకలు చేసిన దారుణాలు, దౌర్జన్యాలు, నేరాలు, ఘోరాల గుట్టు విప్పుతా. ఇప్పటివరకు చూసింది ట్రైలర్ మాత్రమే. అసలు సినిమా ముందుంది. ఎందుకు తొందరపడుతున్నావు, ఇంటర్వెల్‌లోనే రాజకీయ సన్యాసానికి సిద్ధంగా ఉండు' అంటూ ట్వీట్ చేశారు. పచ్చ కామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందన్న సామెత కేతిరెడ్డికి చక్కగా అతుకుతుందంటూ చురకలు అంటించారు.

అలరించిన దంతవేదాంతం

పుట్టపర్తి, అక్టోబరు 2: తెలంగాణలోని మహబూబ్‌నగర్‌కు చెందిన భక్తులు బుధవారం సాయంత్రం స్థానిక సాయికుల్వంత్ సభా మండపంలో దంతవేదాంతం నాటిక ద్వారా భక్తులను అలరింపజేశారు. సత్యసాయి బోధనలు, ప్రేమతత్వాన్ని తెలియజేస్తూ భక్తిపాటలు ఆలపించారు. అష్టోత్తర శతనామావళి పేరిట సత్యసాయి నామావళిని పఠించారు. భక్తులకు సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.





నృత్యం చేస్తున్న బాలవికాస్ విద్యార్థులు, నాటికలోని సన్నివేశం

మాతా.. శరణు..

నేటి నుంచి శరన్నవరాత్రులు

ముస్తాబైన ఆలయాలు



పుట్టపర్తి, అక్టోబరు 2: అమ్మవారి ఉత్సవాలకు వేళయింది. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ఆలయాలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

ముగిసిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కొత్తచెరువు, అక్టోబరు 2: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర-2047 జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు బుధవారం ముగిశాయి. జిల్లాలోని 32 మండలాల నుంచి 169 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వ్యాసరచనలో షఫీ ఖయ్యుం (గాండ్లపెంట), లాస్య (జడ్పీహెచ్ఎస్, తలమర్ల), రేహశ్రీ (జడ్పీహెచ్ఎస్ అగళి) వరుసగా తొలి మూడుస్థానాల్లో నలిచారు. వక్తృత్వ పోటీలో లక్ష్మీనివాస్(ధర్మవరం ఆదర్శ పాఠశాల) విజేతగా, బి.సుష్మిత (చిలమత్తూరు), భవిత (గోరంట్ల) ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు డీఈఓ మీనాక్షి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సమగ్రశిక్ష సీఎంఓ అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న డీఈఓ

పకడ్బందీగా దరఖాస్తుల స్వీకరణ



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య

పెనుకొండ టౌన్, అక్టోబరు 2: నూతన మ ద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణను పకడ్బందీగా నిర్వహించాలని డి ప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. 9న సాయంత్రం 5గంటలకు దరఖాస్తుల స్వీకరణ ముగుస్తుందన్నారు. 11న లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, ఏఈఎస్ నరసింహులు, సీఐ సృజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో రొద్దం ఎంపీపీ మృతి



పెనుకొండ రూరల్, అక్టోబరు 2 : రొద్దం ఎంపీపీ చంద్రశేఖర్(67) బుధవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆ యన గత కొన్ని రోజులుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ క్ర మంలో ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ మృతి చెందారు. రొద్దం ఎంపీపీగా పనిచేస్తున్న చంద్రశేఖర్ మృతి పార్టీకి తీరనిలోటని వైసీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం ప్రకటించారు.

అన్ని ఆరోగ్య సేవలు అందేలా చూస్తా

'పురం' ఆసుపత్రి సూపరింటెండెంట్ లింగన్న.. బాధ్యతల స్వీకరణ



హిందూపురం అర్బన్, అక్టోబరు 2: ఆసుపత్రికి వచ్చే ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందేలా చూస్తానని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన లింగన్న తెలిపారు. బుధవారం ఆయన ఎఫ్ఏసీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండటమే కాకుండా అన్ని రకాల వైద్యసేవలు, మందులు అందేలా చొరవ చూపుతానని అన్నారు. ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా విధులు నిర్వహిస్తామన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఆయనకు పలువురు వైద్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎండిన ఆశలు

పూర్తిగా ఎండిపోయిన వేరుశనగ పైరు.. తొలగించుకున్న రైతు



ఎండిపోయిన వేరుశనగ పంట



ట్రాక్టర్‌తో తొలగించిన పంట

ఆశల పంట నిలువునా ఎండిపోయింది. అన్నదాతకు కన్నీళ్లు మిగిల్చింది. కనీసం పశుగ్రాసం కూడా దక్కలేదు. చేసేదిలేక పంటను తొలగించారు. రూ.వేల పెట్టుబడులు, రైతు కష్టం నేలపాలయ్యాయి. నంబులపూలకుంట మండలంలోని పి.గొల్ల పల్లికి చెందిన మహిళారైతు శ్యామల ఖరీఫ్‌లో వర్షాధారం కింద మూడెకరాల్లో వేరుశనగ సాగు చేసింది. రూ.50వేలుపైగా పెట్టుబడి పెట్టింది. తీవ్ర వర్షాభావంతో పంట పూర్తిగా ఎండిపోయింది. కాపు అస్సలు లేదు. పశుగ్రాసానికి కూడా పనికిరాకుండా పోయింది. దీంతో రైతు చేసేదిలేక పంటను బుధవారం తొలగించేసింది. రైతు పెట్టిన పెట్టుబడిలో రూపాయి కూడా వెనక్కిరాలేదు. సర్వం నష్టపోయినట్లు రైతు ఆవేదన చెందింది. -నంబులపూలకుంట

- కేంద్రం ఇచ్చిన వడ్డీ రాయితీ సొంత ఖాతాలకు..
- సిబ్బందికి జీతాలు చెల్లించలేని స్థితిలో 70 సొసైటీలు
- ఉమ్మడి జిల్లాలో మూతపడిన పలు సొసైటీలు
- అస్తవ్యస్తంగా ఏడీసీసీ బ్యాంకు పాలన



రూ.5 కోట్లు స్వాహా!

ఏడీసీసీబీలో రైతుల సొమ్ము మెక్కేశారు


మూతపడిన కూడేరు సొసైటీ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 2: ఏడీసీసీ బ్యాంకులో కొందరు అధికారులు... రైతులకు అందాల్సిన రూ.5కోట్లు స్వాహా చేశారు. 2020-21 సంవత్సరానికి రైతులు తీసుకున్న రుణాలకు చెల్లించాల్సిన వడ్డీ రాయితీని ఎగ్గొట్టి, ఆ సొమ్మును తమ ఖాతాల్లోకి వేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 115 సొసైటీల్లో సుమారు 3లక్షల మంది రైతులు ఖాతాదారులుగా ఉన్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో రైతులు తీసుకున్న రుణాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.5కోట్ల వడ్డీ రాయితీ నిధులు చెల్లించింది. అయితే ఇంతవరకు రైతులకుగాని, సొసైటీలకుగాని ఆ నిధులు చేరలేదు. పైగా సొసైటీలపై జరిమానాలు సైతం విధించారు. అటు ఆప్కాబ్, నాబార్డుల ప్రమేయం, అనుమతి లేకుండా జరిమానాల పేరుతో నిధులను సొంతానికి వాడేశారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఐదు సొసైటీలు మూతపడగా, మరో 10 మూతపడేందుకు సిద్ధంగా ఉన్నాయి.


ఇటీవల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి శివనారాయణ్ శర్మ

రూ.5 కోట్ల నిధులు ఏమయ్యాయి..?

ఇటీవల నిర్వహించిన ఏడీసీసీ బ్యాంకు మహాజనసభ సమావేశంలో వడ్డీ రాయితీ నిధులకు సంబంధించి అధికారులు, సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. సొసైటీలను నష్టాల్లోకి నెట్టేస్తూ బ్యాంకు అధికారులు తమ జేబులు నింపుకుంటున్నారని సభ్యులు బహిరంగంగానే ఆరోపించారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో సొసైటీల ద్వారా రైతులకు చెల్లించాల్సిన వడ్డీ రాయితీ నిధులు రూ.ఐదు కోట్లను కేంద్రప్రభుత్వం విడుదల చేసింది. ఆ నిధులు ఏమయ్యాయని అడిగితే సమాధానం చెప్పేవారే లేదు. ఈఅంశంపై విచారణ జరిపించాలని సొసైటీ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు రూ.600 కోట్ల ఔట్‌స్టాండింగ్ రుణాలు, రూ.150కోట్ల వరకు ఎన్‌పీఏలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 70సొసైటీలు సిబ్బందికి ఏడాదిన్నరగా జీతాలు కూడా చెల్లించలేని దుస్థితికి చేరాయి.

'అగ్ర' పెత్తనంపై ఉద్యోగుల అసంతృప్తి

ఏడీసీసీ బ్యాంకులో అగ్ర పెత్తనంపై ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారు. బ్యాంకులో కీలక పోస్టులో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళ ఉన్నారు. ఆ తరువాత పోస్టులో అగ్రవర్ణాలకు చెందిన అధికారులు ఉన్నారు. ఇటీవల డెప్యుటేషన్‌పై వెళ్లిన ఓ అధికారి తిరిగి బ్యాంకుకే చేరారు. మరో అధికారి కీలక పోస్టు పదవీకాలం ముగియడంతో ఆ తరువాత పోస్టుకు చేరారు. తరువాత పోస్టుల్లో ఉన్న అగ్రవర్ణ అధికారులు, కీలకపోస్టులో ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశ్యంతో ఆధిపత్యపోరు సాగిస్తున్నారు. తాజాగా కీలక పోస్టు నుంచి ఆ తరువాత పోస్టుకు వచ్చిన అధికారి మొదటి అంతస్తులో గదులు ఉన్నప్పటికీ.. రెండో అంతస్తులో సమావేశాలకు సంబంధించి న గదిని ఆక్రమించుకుని రాజదర్బార్‌లాగా చాంబర్‌ను మార్చుకున్నారు. అధికారులు, పాలకవర్గం, సిబ్బంది ఉండే మొదటి అంతస్తు నుంచి రెండో అంతస్తుకు కార్యకలాపాలకు ఉద్యోగులు వెళ్లాల్సి వస్తోంది. పైగా మహిళా ఉద్యోగులు రెండో అంతస్తుకు వెళ్లి ఆ అధికారిని కలవాలంటే ఆందోళన చెందుతున్నారు.

ప్రోత్సాహకాల నిలిపివేత

గత ఐదేళ్లుగా సొసైటీలకు ఇవ్వాల్సిన రాయితీలను ప్రభుత్వం నిలిపివేసింది. బ్యాంకుకు వచ్చే మొత్తం లాభంలో సొసైటీలకు ఇవ్వడం లేదు. ఐదేళ్లకు రూ.5కోట్లకు గాను ఇంతవరకు ఒక్క నయా పైసా చెల్లించకపోగా జరిమానాలు విధిస్తూ వస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఆ సొసైటీని బ్లాక్‌లిస్టులో పెట్టేస్తారు. ఇలా బ్యాంకు అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా గత వైసీపీ ప్రభుత్వంలో కీలక పోస్టుల్లో ఉన్న అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది.

ఆ నిధులపై విచారణకు ఆదేశించాం

సొసైటీలలో రైతుల రుణాల వడ్డీ రాయితీకి సంబంధించిన నిధుల మాయంపై విచారణ జరిపి, నివేదిక పంపాలని జిల్లా సహకార శాఖ అధికారులు, ఏడీసీసీ బ్యాంకు అధికారులను ఆదేశించాం. నష్టాల్లో ఉన్న సొసైటీలు మూతపడకుండా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అన్వేషించి అండగా ఉంటాం. సొసైటీలు, రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు. బ్యాంకు, సొసైటీల సిబ్బంది సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని సూచించాం. బ్యాంకు, సొసైటీల్లో ప్రతి పైసాకు రికార్డుల రూపంలో లెక్కలు ఉండాలి.

- శివనారాయణ్ శర్మ, ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్


ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం

నిర్వీర్యమైన సొసైటీలు

యాడికి: వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలపై శ్రద్ధ చూపకపోవడంతో అవి నిర్వీర్యమయ్యాయి. గతంలో వ్యవసాయ సహకార సొసైటీల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరలకు లభించేవి. ప్రస్తుతం అలాంటి సేవలు ఏవీ అందడం లేదు. మండలంలో యాడికి, వేములపాడు గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు ఉన్నాయి. యాడికి ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో 3816మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వేములపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో 1860మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. గతంలో సొసైటీల ద్వారా రైతులు రుణాలు పొందేవారు. ప్రస్తుతం రుణాలు కూడా ఇవ్వడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. గత టీడీపీ హయాంలో వ్యవసాయ సహకార సొసైటీల ద్వారా విత్తన పంపిణీ, ఎరువుల విక్రయాలు, రుణాల మంజూరు విరివిగా జరిగేవని రైతులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయ సహకార సొసైటీలపై నిర్లక్ష్యం వహించడంతో అవి పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. అలాగే ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల్లో ఎరువులు, మందుల విక్రయాలకు గతంలో అనుమతులు ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇవి పూర్తిగా రద్దయ్యాయి. దీంతో మండలంలోని సొసైటీల ద్వారా ఎరువులు, మందుల విక్రయాలు జరగడం లేదు. వ్యవసాయ సహకార సొసైటీలకు ఎరువులు మందుల విక్రయాలకు లైసెన్సులు ఇస్తే సొసైటీలు అభివృద్ధి చెందడంతోపాటు రైతులకు మెరుగైన సేవలు అందుతాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

పెరిగిన టమోటా ధరలు

అనంతపురంరూరల్, అక్టోబరు 2: టమోటా ధరలు భారీగా పెరిగాయి. కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో బుధవారం మేలి రకం కాయలు కిలో రూ.74తో అమ్ముడుపోయాయి. దిగుబడులు తగ్గిపోవడం ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. బుధవారం మార్కెట్‌కు 675 టన్నులు వచ్చినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. కిలో సరాసరి ధర రూ.65 పలుకగా..కనిష్ఠ ధర రూ.50తో అమ్ముడు పోయినట్లు ఆయన తెలిపారు.

జైలు శిక్ష గుణపాఠం కావాలి

- జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్


మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, అక్టోబరు 2: ఖైదీలు జైలు శిక్షను గుణపాఠంగా తీసుకుని సత్ప్రవర్తనలతో మెలగాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఆయన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్‌తో కలిసి జిల్లా జైలును తనిఖీ చేశారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఖైదీల బ్యారెక్‌లు క్షుణ్ణంగా పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఇకపై ఎలాంటి నేరాలకు పాల్పడకుండా జీవించాలన్నారు.


జడ్పీలో ఉత్తర్వులు తీసుకుంటున్న ఉద్యోగులు

ఉద్యోగులతో బంతాట

- ప్రహసనంగా జడ్పీలో బదిలీలు
- గడువు ముగిసిన 11 రోజులకు ఉత్తర్వులు
- హైకోర్టును ఆశ్రయించిన ఓ ఉద్యోగి

అనంతపురం విద్య, అక్టోబరు 2: జిల్లా పరిషత్ ఉద్యోగులతో బదిలీ బంతాట ఆడేస్తున్నారు. పాలకవర్గం, అధికారులు ఎవరికివారే అన్నట్లుగా వ్యవహరిస్తూ.. ఉద్యోగులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. బదిలీలను బ్యాన్‌చేసిన 11 రోజుల తర్వాత ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. గత నెల 22వ తేదీనే బదిలీల గడువు ముగిసింది. 23న ఉత్తర్వులు అదిగో ఇస్తాం.. ఇదిగో ఇస్తాం అంటూ తిప్పుకున్నారు. కలెక్టర్ నుంచి ఒత్తిడి రావడంతో అర్ధరాత్రి తర్వాత ఉత్తర్వులు వాట్సప్ చేశారు. దీనిపై ఇప్పటికే ఓ ఉద్యోగి హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. కోర్టు నుంచి జడ్పీ ఉన్నతాధికారులకు నోటీసులు వచ్చినట్లు సమాచారం. మరోవైపు బదిలీలు ముగిసిన 11 రోజుల తర్వాత ఉత్తర్వులిచ్చారు. గాంధీ జయంతి రోజున బుధవారం బదిలీ ఉత్తర్వులిచ్చారు.

ఉద్యోగుల్లో టెన్షన్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న జడ్పీ ఉద్యోగులు సుమారు నెల రోజులుగా పడని టెన్షన్ లేదు. ఎవరికి ఎక్కడికి ఆర్డర్ వస్తుందో తెలియని పరిస్థితి. బదిలీలు ముగిసిన 10 రోజుల వరకూ ఎవరికి ఎక్కడికి పోస్టింగ్ వస్తుందో కూడా తెలియని పరిస్థితి. 22వ తేదీ బదిలీల గడువు ముగిసిన తర్వాత... రెండు రోజులకు రాత్రి వాట్సప్‌లో ఆర్డర్లు తోసేశారు. తర్వాత తీరిగ్గా 'మీరు పనిచేస్తున్న ప్రాంతానికి పోస్టులో ఉత్తర్వులు పంపుతాం' అని చెప్పారట. కానీ పోస్టు ద్వారా కూడా పంపలేదని తెలిసింది. అయితే ఎవరికి ఎక్కడికి ఆర్డర్ వస్తుందో తెలియక చాలా మంది ఉద్యోగులు మదనపడ్డారు. ముందేగానే లక్షలు కుమ్మరించిన వారికి ఫలానా చోటికి పోస్టింగ్ అంటూ సూచనలు చేశారు. కానీ కొందరు కోర్టును ఆశ్రయించడంతో జడ్పీ ఉన్నతాధికారులకు గొంతులో వెలక్కాయపడ్డట్లు అయ్యింది. తర్వాత ఈ నెల 1వ తేదీ కూడా కొందరికి ఫోన్లు చేసి కేటాయించిన స్థానాలు మారుతాయని చెప్పినట్లు సమాచారం.

హైకోర్టుకు ఓ ఉద్యోగి..

పుట్టపర్తి ప్రాంతానికి చెందిన ఓ ఉద్యోగికి హైకోర్టును ఆశ్రయించారు. ఉద్యోగుల బదిలీల్లో నిబంధనలు పాటించడం లేదని, గడువు ముగిసిన తరువాత ఈ నెల 24వ తేదీ ఉత్తర్వులు ఇచ్చే ప్రయత్నాలు చేసి, ఉద్యోగులను ఆందోళనకు గురిచేశారని ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆయనకు జడ్పీ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు నుంచి స్టే వచ్చినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో హైకోర్టు నుంచి జడ్పీకి నోటీసులు వచ్చాయని, అధికారులు గోప్యంగా ఉంచారని సమాచారం. మరో వైపు బుధవారం కూడా బదిలీల ఉత్తర్వులను మార్చేందుకు ప్రయత్నించారని ఉద్యోగుల్లో చర్చ సాగింది.

వ్యాపారం పూర్తి కాగానే..

బదిలీల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయన్న విమర్శలు భారీగా వినిపిస్తున్నాయి. అందువల్లే 22వ తేదీ ఇవ్వాల్సిన ఉత్తర్వులను 2వ తేదీ గాంధీ జయంతి సాక్షిగా ఇచ్చారని సమాచారం. జడ్పీ సమావేశ మందిరానికి పిలిపించి, ఉద్యోగులకు ఉత్తర్వులు ఇచ్చారు. నిబంధనలను ఉల్లంఘించి, ఇంత బాహాటంగా బదిలీ ఉత్తర్వులను ఇస్తూ.. బదిలీల ప్రక్రియను ప్రహసనంగా మార్చేశారు. లక్షలాది రూపాయల బిజినెస్ డీల్ పూర్తి కాగానే బదిలీ ఉత్తర్వుల కాపీలను బయటకు వదిలారని జడ్పీ ఉద్యోగులు వాపోతున్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.


మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

అమ్మాయిలకు ఆటల పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 2: గ్రామీణ బాలికల అథ్లెటిక్ పోటీలు బుధవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఆర్డీటీ-అనంత క్రీడాగ్రామం సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 38 ప్రాంతాల నుంచి 400మందికి పైగా క్రీడాకారిణులు పోటీల్లో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు సాగే ఈపోటీలకు వచ్చిన క్రీడాకారులకు భోజనం, వసతి సదుపాయాలు ఆర్డీటీలో కల్పించారు. ఆర్డీటీ డీఐడీ డైరెక్టర్ మహ్మద్ రఫీక్, లైఫ్‌స్కిల్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ లైలా జులేఖా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే బాలికలు రాణించేలా అవకాశాలు కల్పించడానికే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలికలకు 60మీటర్లు, 100 మీటర్లు, 200మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. అనంతరం భారత్ పారా అథ్లెటిక్ జట్టు కోచ్ సురేష్‌కుమార్, పారా ఒలంపిక్స్‌లో కాంస్య విజేత దీప్తి జీవన్‌జీలను ఉత్తమ అవార్డులతో సత్కరించారు.

క్రీడాజ్యోతితో పరుగులు తీస్తున్న క్రీడాకారిణులు


సర్దుబాటు చార్జీల పెంపు ప్రతిపాదన సరికాదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, అక్టోబరు 2: విద్యుత్ సర్దుబాటు చార్జీలు పెంపు ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో వివిధ రూపాల్లో మోపిన విద్యుత్తు చార్జీల భారాన్ని తగ్గిస్తామని, చార్జీలు పెంచబోమని 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమి హామీ ఇచ్చిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలు (ఎఫ్‌పిపిసిఏ) 2022-23 సంవత్సరానికి దాదాపు రూ.8114కోట్లు భారం వేస్తూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలతో విద్యుత్ నియంత్రణ మండలి(ఇఆర్‌సి) నోటిఫికేషన్ జారీ చేయడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి మరో రూ.11వేల కోట్లకు పైగా సర్దుబాటు చార్జీల భారం మోపుతున్నట్లు వార్తలొస్తున్నాయన్నారు. విద్యుత్ వినియోగదారులు, రాష్ట్ర ప్రజలపై దాదాపు రూ.20వేలకోట్ల భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ విద్యుత్ కంపెనీల దోపిడీ, అధిక రేట్లకు ఎక్స్ఛేంజిలో స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు, వివిధ స్థాయిల్లో అవినీతి, అపసవ్య విధానాల వల్ల విద్యుత్ వ్యయం పెరుగుతోందని తెలిపారు. ఆ భారాన్ని సర్దుబాటు చార్జీల రూపంలో జనం నెత్తిన వేయటం సరికాదన్నారు.

అంతా రహస్యం

- డీసీఈబీ అక్రమాలపై రహస్య విచారణ!
- మొన్న డీవైఈఓ విచారణ, నివేదిక అందజేత
- విచారణకు చిత్తూరు నుంచి ఆర్జేడీ టీం
- బయటకు పొక్కకుండా గోప్యత

అనంతపురం విద్య, అక్టోబరు 2: జిల్లా విద్యాశాఖ పరిధిలోని డీసీఈబీలో జరిగిన అక్రమాలపై రహస్యగా విచారణ చేస్తున్నారు. గత నెలలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వరుస కథనాలకు స్పందించిన కలెక్టర్, ఆర్జేడీ వేర్వేరుగా విచారణకు ఆదేశించారు. ఈ రెండు విచారణలను రహస్యంగా సాగిస్తున్నట్టు తెలుస్తోంది. కోట్ల రూపాయల కుంభకోణంలో డీసీఈబీలోని అధికారులతోపాటు, పరీక్షల విభాగం అధికారులు, జిల్లా విద్యాశాఖలోని ఉన్నతాధికారుల ప్రమేయం కూడా ఉండటంతో విచారణను తూతూ మంత్రంగా నడిపించి, మమ అనిపించి, ఏం లేదన్నట్టుగా రిపోర్టులు బయటకు వచ్చేలా అనేక వ్యూహాలు పన్నుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే ఈ రెండు రకాల విచారణలను రహస్యంగా సాగేలా వ్యవహారాలు చక్కబెట్టారనే విమర్శలు వస్తున్నాయి.


జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం

30వ తేదీ డీవైఈఓ విచారణ

డీసీఈబీలో అక్రమాలపై గుత్తి డిప్యూటీ డీఈఓ గతనెల 30న గుట్టుగా విచారణ చేశారు. గత ఏడాది ఎఫ్‌ఏ-3 ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ ముద్రణ, సరఫరాకి సంబంధించిన రూ. 31.80 లక్షల వర్క్ ఆర్డర్‌లో నకిలీ ఉత్తర్వులు సృష్టించిన తంతు తెలిసిందే. ఈ అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో గతంలో వరుస కథనాలు వచ్చాయి. దీనికి స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. 7 రోజుల్లో విచారణ నివేదిక ఇవ్వాలంటూ కలెక్టర్ నుంచి డీఈఓకు ఆదేశాలు వచ్చాయి. డీవైఈఓ రహస్యంగా విచారణ చేసినట్టు తెలిసింది. విద్యాశాఖ అధికారులకు కూడా తెలియకుండా ఈ విచారణ సాగించినట్టు సమాచారం. ఈ నివేదికను సదరు విచారణాధికారి 2వ తేదీ డీఈఓకు అందజేసినట్లు సమాచారం.

జిల్లాకు ఆర్జేడీ టీం....?

డీసీఈబీలో జరుగుతున్న అక్రమాలపై కడప ఆర్జేడీ శామ్యూల్ సైతం విచారణకు ఆదేశించారు. చిత్తూరు విద్యాశాఖలో పనిచేసే ఇద్దరు అధికారులను ఆయన గతంలో విచారణ బృందం సభ్యులుగా నియమించారు. చిత్తూరు డీఈఓ కార్యాలయంలో పనిచేసే ఒక ఏడీ, మరో అధికారి బుధవారం విచారణాధికారులుగా వస్తారని డీఈఓ ఆఫీస్‌కు ముందుగానే సమాచారం అందించినట్లు తెలిసింది. డీసీఈబీ అధికారులు విచారణకు హాజరుకావాలంటూ ముందుగానే 2వ తేదీ డేట్ కూడా ఇచ్చినట్టు తెలిసింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఆ వాతావరణం కనిపించలేదు. దీంతో ఇక్కడ కాకుండా బయట మరోచోట విచారణ రహస్యంగా చేసివుంటారన్న టాక్ డీఈఓ ఆఫీస్‌లో సాగింది. డీఈఓ ఆఫీస్‌లో నిత్యం కనిపించే పరీక్షల విభాగంలోని ఒక ఉన్నతాధికారి, డీసీఈబీలోని మరో ఉన్నతాధికారి బుధవారం కనిపించకపోవడం చూస్తుంటే బయట మరోచోట రహస్యంగా విచారణకు హాజరై ఉంటారన్న ప్రచారం సాగింది.

నేటి నుంచి విత్తనాల కోసం రిజిస్ట్రేషన్

అనంతపురం అర్బన్, అక్టోబరు 2: సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు గురువారం నుంచి స్థానిక రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాకు 27139 క్వింటాళ్ల పప్పుశనగ కేటాయించారన్నారు. ఇందులో అనంతపురం డివిజన్‌కు 670 క్వింటాళ్లు, కళ్యాణదుర్గం డివిజన్‌కు 2300, రాయదుర్గం డివిజన్‌కు 5400, గుత్తి డివిజన్‌కు 2వేలు, తాడిపత్రి డివిజన్‌కు 8100, ఉరవకొండ డివిజన్‌కు 6900 క్వింటాళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ సారి పప్పుశనగ జేజీ-11 రకం క్వింటా పూర్తి ధర రూ.9400గా నిర్ణయించారన్నారు. ఇందులో 25 శాతం సబ్సిడీపోను రైతు వాటా కింద క్వింటా పప్పుశనగకు రూ.7050లు చెల్లించాలన్నారు. అర ఎకరాకు ఒక ప్యాకెట్(20 కిలోలు) చెప్పున 5 ఎకరాల వరకూ 10 ప్యాకెట్లు పంపిణీ చేస్తామన్నారు.

1.636 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, అక్టోబరు 2: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో బుధవారం 1.636 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఇన్‌ఫ్లో 812 క్యూసెక్కులుందని వెల్లడించారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 842 క్యూసెక్కులు వెళుతున్నాయని పేర్కొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

గాంధీజీ ఆశయాలను పాటిద్దాం

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో వక్తలు

అనంతపురంరూరల్, అక్టోబరు2: మహాత్మాగాంధీ ఆశయాలను పాటించడం మన అందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని సెయింట్ ఆన్స్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీలు పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే పరిటాల సునీత, జడ్పీ సీఈఓ ఓబుళమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజాప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పారిశుధ్య సేవల్లో కీలకంగా ఉన్న క్లాప్ మిత్రలను సత్కరించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో రెండు వారాల నుంచి అందరూ చిత్తశుద్ధితో పాల్గొనడంతో పారిశుధ్యంలో ప్రజల భాగస్వామ్యంలో మొట్టమొదటి స్థానం వచ్చిందన్నారు. మన ఇల్లు, పరిసరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు ఇతర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..మనందరినీ ఐక్యమత్యం చేస్తూ భవిష్యత్తు కోసం స్వచ్ఛ భారత్ నిర్మించుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, స్వచ్ఛ ఆంధ్ర నిర్మించుకోవాలని రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం పాటుపడుతున్నారన్నారు. స్వచ్ఛత కార్యక్రమాలు ప్రతినిత్యం పాటిస్తూ మన ప్రాంతాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. మరో ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ..చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత అన్ని ప్రాంతాలు, మున్సిపాల్టీలు, పంచాయతీలు, నీరు స్వచ్ఛంగా ఉండాలని స్వచ్ఛాంధ్రప్రదేశ్ అనే కార్యక్రమాన్ని అమలు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ..నరేంద్ర మోదీ ప్రధాని అయిన తర్వాత దేశాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో జిల్లాకు ప్రథమ స్థానం రావడంపై ఆమె ప్రశంసలు కురిపించారు. జిల్లా కలెక్టర్ కృషితో పాటు ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఎంపీడీఓ పుల్లయ్య, తహసీల్దార్ మోహన్‌కుమార్, మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాములరాయి రఘు తదితరులు పాల్గొన్నారు.


అవార్డులు అందుకున్న పంచాయతీ కార్మికులతో కలెక్టర్, ఎంపీలు, ఎమ్మెల్యే తదితరులు



నగర సంకీర్తన నిర్వహిస్తున్న జనసేన నాయకులు

జనసైనికుల నగర సంకీర్తన

ధర్మవరం, అక్టోబరు 2 : శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీని నిరసిస్తూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన పాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా జనసేన నాయకులు నగర సంకీర్తన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. స్థానిక పాండు రంగస్వామి ఆలయం నుంచి అంజుమన్ సర్కిల్ మీదుగా దుర్గమ్మగుడి వరకు నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడ దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాంధీనగర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో జనసేన నాయకులు రాజారెడ్డి, అడ్డగిరి శ్యాంకుమార్, బెస్త శ్రీనివాసులు, నాగసుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు



నెహ్రూ కూడలిలో పనిచేయని నిఘానేత్రాలు

కొత్తచెరువు, అక్టోబరు 2: స్థానిక నెహ్రూకూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. గతంలో ఓ ఎస్ఐ దాతల సహకారంతో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఏదైనా నేరాలు, సంఘటనలు, ప్రమాదాలు జరిగినప్పుడు నిందితులను పట్టుకోవడం కోసం వీటిని ఏర్పాటు చేశారు. అయితే అవి ప్రస్తుతం పనిచేయకపోవడంతో ఆకతాయిలు, దొంగలు ప్రయాణీకుల వద్ద సెల్‌ఫోన్లు చోరీలకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా మందుబాబులు, ఆకతాయిలు రాత్రి వేళల్లో ద్విచక్రవాహనాలపై వేగంగా వెళ్తూ.. స్థానికులను, ప్రయాణి కులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో వారిని పట్టుకోవడానికి పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అవి పనిచేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ప్రారంభం



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

ముదిగుబ్బ, అక్టోబరు 2: స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ బుధవారం ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి కృష్ణకుమార్, పంచాయతీ కార్యదర్శి మంజుల, సర్పంచ్ లక్ష్మీదేవి చంద్రాయుడు, నాయకులు గణపర్తి రమేష్, కృష్ణమూర్తి యాదవ్, ఓబిరెడ్డి, అమీర్, రాము, గంగాధర్ రెడ్డి, రాజా పాల్గొన్నారు.

ఆలయ సిబ్బందికి టీటీ వ్యాక్సిన్

కదిరి, అక్టోబరు 2: స్థానిక ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పారిశుధ్య కార్మికులు, ఇతర సిబ్బందికి టీటీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి సమక్షంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి బి. నాగేంద్రనాయక్, సూపరింటెండెంట్ ఎస్ఎండీ హుస్సేన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జీవో 117 రద్దు చేయాలి

కదిరి అర్బన్, అక్టోబరు 2: జీవో 117ను రద్దు చేయాలని డేమోక్రెటీ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వారు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. ఆంగ్లభాష మాధ్యమంతో పాటు మాతృభాష మాధ్యం యధావిధిగా కొనసాగించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటచలమయ్య, నాగరాజు, నజీర్‌బాషా, నరేంద్ర, షబ్బీర్, వీరారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



కదిరి అర్బన్, అక్టోబరు 2: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కాళసముద్రం గురుకుల పాఠశాలలో పదో తరగ తి చదువుతున్న జశ్వంత్‌నాయక్, సిద్దార్థ ప్రవీణ్ ఎంపికయ్యారు. కడప జిల్లా వేంపల్లిలో గతనెల 20, 21తేదీల్లో జరిగిన 38వ బాలుర సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ చాటిన వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు శుక్రవారం నుంచి తెలంగాణలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

వరద బాధితులకు విరాళం

ముదిగుబ్బ, అక్టోబరు 2 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక పీవీఎస్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు రూ.12,500 డీడీని ముఖ్యమంత్రి సహాయ నిధికి బుధవారం పంపారు. విరాళాలు సేకరించిన విద్యార్థులను ఆ పాఠశాల చైర్మన్ పీవీ నాయుడు అభినందించారు.

తెగిన విద్యుత్ వైరు



కొత్తచెరువు అక్టోబరు 2: స్థానిక బీసీ కాలనీలోని జూనియర్ కళాశాల వెనుక వైపు ప్రాంతంలో విద్యుత్ ఎస్‌టీ వైరు బుధవారం రాత్రి తెగి పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఇలా విద్యుత్ వైర్లు తెగిపడుతుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి... పాత తీగలను తొలగించి... కొత్తవాటిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 2: స్థానిక బీసీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త రామాంజనేయులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి స్థానిక నాయకులు ద్వారా అతనికి రూ. ఐదు వేలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నిజాం, సౌదీ నాగరాజు, మీసేవ సుధాకర్, జ్యోతి పాల్గొన్నారు.

అనంత వైద్య కళాశాలకు స్వచ్ఛ పురస్కారం

అనంతపురం టౌన్ : స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలను మెరుగ్గా నిర్వహించినందుకు వైద్య కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం దక్కింది. గత నెల 17 నుంచి ఈ నెల 2వ తేదీవరకు నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమాలను ప్రభుత్వం పరిశీలించి, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 10 కళాశాలలను పురస్కారాలకు ఎంపిక చేసింది. అందులో ఏఎంసీకి చోటు దక్కిందని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. పురస్కారాలకు ఎంపికైన కళశాలలకు రూ.25 వేల నగదు బహుమతిని ప్రభుత్వం అందజేస్తుంది. మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, వైద్య విద్యార్థులు, వైద్యులను ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ అభినందించారు.



విద్యార్థులతో వైద్య కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

రెగ్యులర్ సమస్యలు..!


- అంతటా ఇన్‌చార్జిల పాలనే
- ముదిగుబ్బ వాసుల ఇక్కట్లు

ముదిగుబ్బ, అక్టోబరు 2 : మండలంలో కొంత కాలంగా రెగ్యులర్ ఉద్యోగులు లేక.. ఇన్‌చార్జుల పాలన కొనసాగుతోంది. దీంతో మెరుగైన సేవలు అందక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

- ఎన్నికల తరువాత తహసీల్దార్ సరస్వతి కర్నూల్‌కు బదిలీ అయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకుమార్ లాంగ్ లీవ్‌పై వెళ్లారు. దీంతో సీఎస్‌డీటీ మునిస్వామికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. పూర్తి అధికారాలు లేకపోవడంతో రెవెన్యూ సమస్యలు ఫ్యామిలీ సర్టిఫికెట్, వన్‌బీ, అడంగల్, మ్యూటేషన్ తదితరాలు పెండింగ్ పడ్డాయి. దీంతో మండల వాసులు కొన్ని నెలల పాటు ఇబ్బందులు పడ్డారు. సోమవారం రెగ్యులర్ డిప్యూటీ తహసీల్దార్‌గా నారాయణస్వామి బాధ్యతలు చేపట్టారు.
- ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌కు సీఐగా శేఖర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినా ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. దీంతో ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావు ఇన్‌చార్జ్ సీఐగా వ్యవహరిస్తున్నారు.
- ముదిగుబ్బ విద్యుత్ ఏఈ చంద్రానాయక్ ఎన్నికలకు ముందే బదిలీపై వెళ్లాడు. సబ్ ఇంజనీర్ శివతేజ ఇన్‌చార్జ్ ఏఈ గా వ్యవహరిస్తున్నారు.
- బీసీ హాస్టల్ వార్డెన్ నారాయణమ్మ జూన్‌లో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో కొత్తచెరువు హాస్టల్ వార్డెన్ సులోచనను ఇన్‌చార్జ్ వార్డెన్‌గా నియమించారు.
- మండలంలోని కొండగట్టుపల్లి పంచాయతీ కార్యదర్శికి కొడవండ్లపల్లి, బూదనాంపల్లి, చిన్నకోట్ల పంచాయతీ పంచాయతీలకు కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- జొన్నలకొత్తపల్లి పంచాయతీ కార్యదర్శికి ఉప్పలపాడు పంచాయతీకి ఇన్‌చార్జ్‌గా, మలకవేముల పంచాయతీ కార్యదర్శికి గుంజేపల్లి పంచాయతీ ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

పోస్టులు భర్తీ చేయాలి

రెవెన్యూ కార్యాలయంలో రెండు క్లస్టర్‌లకు రెండు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఉండగా, ఇక్కడికి ఎవరూ రావడానికి ఇష్టం చూపడం లేదు. దీంతో ఇప్పుడవి ఖాళీగానే ఉన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ముదిగుబ్బ పెద్ద మండలం కావడంతో పలు రెవెన్యూ సమస్యలతో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి నాయకులు అధికారులపై తీసుకొచ్చిన ఒత్తిళ్లతో దీర్ఘకాలంగా ప్రధాన పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అయితే కొత్త ప్రభుత్వమైనా ప్రజలకు అత్యవసరమైన పోస్టులను త్వరగా భర్తీ చేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని మండల వాసులు కోరుతున్నారు.



అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

- స్వచ్ఛతాహీ సేవ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్
- గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం



కలెక్టర్‌తో మెమెంటోలు అందుతున్న పారిశుధ్య కార్మికులు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 2 : మహాత్మా గాంధీ కలలు కన్న పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని చేపట్టామని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని గత నెల 17 నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకూ దేశవ్యాప్తంగా నిర్వహించారన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ముగింపు సందర్భంగా బుధవారం మండలంలోని కప్పలబండ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన సభలో కలెక్టర్ పాల్గొన్నారు. మహాత్మగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతుల సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి కలెక్టర్ ఘననివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో రోడ్లు, పరిసరాలు, మురికికాలువలు, వీధులు శుభ్రం చేసేందుకు పారి శుధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నారని కొనియాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులను ఎంత గౌరవిస్తున్నామో.. పారిశుధ్య కార్మికులనూ అంతే గౌరవించాలని సూచించారు. అనంతరం 32 మండలాలకు సంబంధించి పారిశుధ్య కార్మికులు, ముగ్గురు ఎంపీడీఓలు, ఐదుగురు పంచాయతీ సెక్రటరీలు, కళాకారులకు కలెక్టర్ మెమొంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నపెద్దన్న, జిల్లా పంచాయతీ ఇన్‌చార్జి అధికారి శివకుమారి, మండల స్పెషల్ ఆఫీసర్ శుభదాసు, ఎంపీపీ రమణారెడ్డి, తహసీల్దార్ అనుపమ, ఈఓపీఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, కప్పలబండ ఎంపీటీసీ మధురిమ, సర్పంచులు లక్ష్మీదేవి, ఏట నాగరాజు, మాజీ సర్పంచు చంద్రశేఖర్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, టీడీపీ నాయకులు లెక్కల గోపాల్, వెంకటరామప్ప, పుల్లప్ప, లింగప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వద్దు

న్యాయాధికారి జయలక్ష్మి

కదిరిలీగల్, అక్టోబరు 2: సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, న్యాయాధికారి జయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఏపీ గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహం, కళాశాల వసతి గృహాలను ఆమె పరిశీలించారు. అక్కడ విద్యార్థులకు ఇస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. చదువుకునే గదులు, వంట తయారు చేసే ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మరుగుదొడ్లను సైతం పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం హాస్టల్ నిర్వాహకులతో మాట్లాడుతూ... వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల పట్ల ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.



హాస్టల్ రిజిస్టర్‌లో నమోదు చేస్తున్న న్యాయాధికారి జయలక్ష్మి





గాంధీ, శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న డీఈఓ, కదిరిలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళి

కొత్తచెరువు, అక్టోబరు 2 : గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా డీఈఓ కార్యాలయం వద్ద వారి చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. ఇందులో జిల్లా విద్యాధికారి మీనాక్షి, విద్యాశాఖ ఏడీ రామకృష్ణ, సీసీ సాయినాథ్, ఏపీఓ ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కదిరి: గాంధీ జయంతి సందర్భంగా స్థానిక టవర్‌క్లాక్ వద్ద రాణీ పేట పాఠశాలలో ఉన్న గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, కూటమి నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నంబులపూలకుంట : జాతిపిత మహాత్మ గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను బీజేపీ రాష్ట్ర మైనార్టీ కార్యవర్గ సభ్యుడు షేక్‌బాబ్‌జాన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కదిరి పట్టణంలోని టవర్‌క్లావర్ వద్ద రాణి పాఠశాలలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ మండలాధ్యక్షుడు చాంద్‌బాషా, కేవీ రమణ ఉన్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి: సీఐటీయూ



నిరసన ర్యాలీలో సీఐటీయూ,సీపీఎం, రైతుసంఘం నాయకులు

ధర్మవరం, అక్టోబరు 2 : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని విజయవాడలో చేస్తున్న దీక్షలకు మద్దతుగా ర్యాలీని సీఐటీయూ కార్యాలయం నుంచి కళాజ్యోతి సర్కిల్ వరకు చేపట్టారు. అక్కడ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ మాట్లాడుతూ... విశాఖ ఉక్కు కోసం అనేక రకాలుగా పోరాటాలు కొనసాగించి సాధించుకున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చేయడానికి అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో 75 లక్షల టన్నులు ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉన్నా.. కేవలం 25 లక్షల టన్నులు మాత్రమే చేయడానికి ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల కో-కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఎల్‌ఆదినారాయణ, సీపీఎం నాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీపీఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

నల్లమాడ, అక్టోబరు 2: మండల కేంద్రంలో నివాసమున్న పఠాన్ సాహెబ్‌ఖాన్ (78) అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. ఐదు రోజుల క్రితం బాత్‌రూంలో అమర్చిన గీజర్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో అగ్నిప్రమాదం జరిగింది. ఇందులో పఠాన్ సాహెబ్‌ఖాన్ గాయపడ్డాడు. అతన్ని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. మృతదేహానికి నల్లమాడలో అంత్యక్రియలు నిర్వహించారు. పఠాన్ సాహెబ్‌ఖాన్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

యువకుడి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ

ముదిగుబ్బ, అక్టోబరు 2 : మండలంలోని తప్పెటవారిపల్లి గ్రామానికి చెందిన చిన్న నారాయణ కుమారుడు సత్యనారాయణ (21) అనుమా నాస్పద స్థితిలో మరణించాడు. ఇతను కియా సంస్థలో పనిచేసేవాడు. రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. బుధవారం సాయంత్రం పొలానికి వెళ్లాడు. రాత్రి పొలంలో అతను చనిపోయి పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ సీఐ శ్యామ్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని.. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

సత్యాగ్రహ దీక్షలో యూటీఎఫ్ నాయకులు

దీక్షకు జేవీవీ, సీఐటీయూ మద్దతు



సత్యాగ్రహ దీక్షలో యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం, అక్టోబరు 2 : మున్సిపల్ టీచర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, నాయకులు చంద్రశఖర్‌రెడ్డి, సీఐటీయూ నాయకుడు జేవీ రమణ సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన జరిగి 10 సంవత్సరాలు కావస్తున్నా నేటికి ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు... మున్సిపల్ టీచర్లకు కల్పించడం లేదన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇప్పటికీ తగినంత సబ్జెక్టు టీచర్లు లేరన్నారు. 3,4,5 తరగతులను విలీనం చేశారే తప్ప.. ఆ తరగతులు బోధించడానికి స్కూల్ అసిస్టెంట్లను ఇవ్వలేదన్నారు. ప్రమోషన్లు, బదిలీలు కూడా రెగ్యులర్‌గా జరగడం లేదన్నారు. మున్సిపల్ టీచర్ల పీఎఫ్ ఖాతాలు మున్సిపాలిటీలలో నిరుపయోగంగా పడి ఉన్నాయన్నారు. జీతాల నుంచి మినహాయించే సొమ్ము వారి ఖాతాలకు జమచేసేందుకు కానీ ఖాతాలలో ఉన్న సొమ్ము అవసరాలకు వినియోగించుకునేందుకు కానీ అవకాశం లేకుండా పోయిందన్నారు. దీక్షలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ మెంబరు రామకృష్ణనాయక్, ధర్మవరం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు హరికృష్ణ, సాయిగణేశ్, నాయకులు లక్ష్మయ్య, రాంప్రసాద్, రామాంజినేయులు, ఆంజనేయులు, మేరివరకుమారి, లతాదేవి, నాగేంద్రమ్మ, మణిమాల, విజయరాణి, నాగేంద్రకుమార్, సకల చంద్రశేఖర్, సురేశ్ పాల్గొన్నారు.

గాంధీజీ, శాస్త్రికి ఘననివాళి






మడకశిరలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న, పావగడలో ఎమ్మెల్యే వెంకటేష్ పాదయాత్ర, హిందూపురంలో పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా బుధవారం పలుచోట్ల వారికి ఘనంగా నివాళి అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం వారు చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కోసం కృషి చేద్దామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. మడకశిర ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసమూర్తి, రాధాకృష్ణ, నాగరాజు, భక్తర్, మనోహర్, సుబ్బరాయుడు, రవి పాల్గొన్నారు. మడకశిర పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. సోమందేపల్లి, లేపాక్షి మండలాల్లో గాంధీ, శాస్త్రికి ఘనంగా నివాళులర్పించారు. చిలమత్తూరు పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, సర్పంచ్ సంధ్య కలిసి గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. హిందూపురంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, కుల సంఘాలు, రాజకీయ నాయకులు గాంధీ, శాస్త్రికి ఘనంగా నివాళి అర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో దండురోడ్డులోని వృద్ధాశ్రమంలో బ్రెడ్, బిస్కట్లు, పండ్లు అందించారు. వైసీపీ నాయకులు పార్టీ కార్యాలంలో గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలు కొనియాడారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గుడిబండ మండలంలో ఎంపీడీఓ రామారావు, డిప్యూటీ తహసీల్దార్ రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. పావగడలో ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శనిమహాత్మ సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు పాదయాత్ర చేపట్టారు. గోరంట్ల మండలంలో టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్, నిమ్మల చంద్రశేఖర్, సుధాకర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, అజుము, మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, ఎంపీపీ, ఏపీఓ వరప్రసాద్ పాల్గొన్నారు. మడకశిర ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజిని దేవి, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల పాల్గొన్నారు. ఏఆర్ రొప్పంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగమల్లేశ్వరి నిర్వహించారు. పెనుకొండ మండలంలోని గుట్టూరు సచివాలయంలో కియా ప్రతినిధులు, ఎంపీడీఓ శివశంకరప్ప పాల్గొన్నారు. అమరాపురంలో ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ భాస్కర్, ఏపీఓ జగదీష్, ఏఎస్ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

అగళి, అక్టోబరు 2: మండల కేంద్రానికి చెందిన నళిని అనే విద్యార్థిని పీజీలో చేరేందుకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు. నళిని డిగ్రీ పూర్తీ చేసి పీజీ చేయడానికి ప్రవేశ పరీక్ష రాయగా బుక్కరాయసముంద్రం సెంట్రల్ యూనివర్సిటీలో సీటువచ్చింది. విద్యార్థిని తండ్రి లేకపోవడంతో ఆర్థిక స్థోమతలేక ఎమ్మెల్యేను సంప్రదించగా ఆయన అనంతపురం ఆర్అండ్ గెస్ట్ హౌస్‌లో విద్యార్థినికి పీజీ అడ్మిషన్ కోసం రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ప్రధానోపాధ్యాయుడి ఆధ్వర్యంలో..



ఆర్థికసాయం అందజేస్తున్న హెచ్‌ఎం విశ్వనాథ్

మడకశిర రూరల్, అక్టోబరు 2: పేదరికంతో చదువులు సాగించడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నలుగురు పేద విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. మండలంలోని బుళ్లసముద్రం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్ ఆధ్వర్యంలో నలుగురు విద్యార్థులకు రూ.36 వేలు అందజేశారు. ఛత్రం గ్రామానికి చెందిన శాలినికి రూ.15 వేలు, ఆర్.పెద్దపల్లికి చెందిన భవితకు రూ.7 వేలు. బుళ్లసముద్రంకి చెందిన సాయి స్వర్ణలత రూ.7 వేలు, మడకశిరకు చెందిన నయనశ్రీ కి రూ.7వేలు ఆర్థిక సహాయం అందిజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై బాధ్యతగా పనిచేయాలి

హిందూపురం అర్బన్, అక్టోబరు 2: వార్డుల్లో నెలకొన్న సమస్యలపై సచివాలయ ఇంజనీరింగ్ విభాగం కార్యదర్శులు పర్యవేక్షించి బాధ్యతగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ సంగ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన 'నిర్లక్ష్యం ఫలితం, పురంలో మళ్లీ పాతరోజులు' అనే కథనానికి కమిషనర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ వార్డుల్లో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ విశ్వనాథ్, డీఈ బాలసుబ్రహ్మణ్యం, ఏఈ జనార్దన్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు పంపిణీ

పావగడ, అక్టోబరు 2 : గత ఆదివారం పిడుగుపాటుకు గురై మృతి చెందిన గొడిగెనహళ్లి శ్రీనివాస్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల నష్టపరిహార చెక్కును ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్ బుధవారం అందజేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ వరదరాజు, ఆర్ఐ రాజగోపాల్, మున్సిపల్ అధ్యక్షుడు రాజేష్, ఉపాధ్యక్షులు గీతా హనుమంతరాయప్ప, కాంగ్రెస్ నాయకులు నాని, శంకర్‌రెడ్డి, రిజ్వాన్, షాబాబు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

హిందూపురం(పరిగి), అక్టోబరు 2 : పరిగి పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులను బీజేపీ నాయకుడు పరిగి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో సన్మానించి దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ శ్రీసత్యసాయిజిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్‌స్వామి, సర్పంచ్ లక్ష్మీశివశంకర్, కార్యదర్శి అరుణ, నాయకులు గోవిందరెడ్డి, చంద్ర, హనుమయ్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

హిందూపురం(సోమందేపల్లి), అక్టోరు 2 : క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వం ఉంటుందని ఎస్ఐ రమేష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని హిందూపురం రోడ్డులోగల బయలులో క్రికెట్ టోర్నీని నీరుగంటి చంద్ర, ఎస్ఐ రమేష్ ప్రారంభించారు. టాస్‌వేసి చెన్నాపురం, సాయినగర్ టీమ్‌లతో క్రికెట్ మొదటి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్ర బౌలింగ్ చేయగా ఎస్ఐ బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జబీవుల్లా, దేవా, ఫారూక్, అంజి, శ్రీనివాసులు, అనీల్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

గోరంట్ల, అక్టోబరు 2: గోరంట్ల పోలీస్‌స్టేషన్‌ను పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. పరిసర ప్రాంతాలు, పట్టుబడిన ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేస్తూ పెండింగ్ ఉన్న కేసులు త్వరగా పరిష్కరించాలని సీఐ శేఖర్‌ను ఆదేశించారు. సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా జ్యోతి

గుడిబండ, అక్టోబరు 2 : గుడిబండ మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్నారు. బుధవారం వీఎస్ఆర్ ఫౌండేషన్ వారు 2024విద్యాసంవత్సరంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేశారు. విజయవాడ కమ్యూనిస్ట్ భవనంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు చేతులమీదుగా రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డును అందుకున్నారు. దీంతో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

సత్యాగ్రహ దీక్షలో యూటీఎఫ్ నాయకులు
దీక్షకు జేవీవీ, సీఐటీయూ మద్దతు

ధర్మవరం, అక్టోబరు 2 : మున్సిపల్ టీచర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, నాయకులు చంద్రశఖర్‌రెడ్డి, సీఐటీయూ నాయకుడు జేవీ రమణ సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన జరిగి 10 సంవత్సరాలు కావస్తున్నా నేటికి ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు... మున్సిపల్ టీచర్లకు కల్పించడం లేదన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇప్పటికీ తగినంత సబ్జెక్టు టీచర్లు లేరన్నారు. 3,4,5 తరగతులను విలీనం చేశారే తప్ప.. ఆ తరగతులు బోధించడానికి స్కూల్ అసిస్టెంట్లను ఇవ్వలేదన్నారు. ప్రమోషన్లు, బదిలీలు కూడా రెగ్యులర్‌గా జరగడం లేదన్నారు. మున్సిపల్ టీచర్ల పీఎఫ్ ఖాతాలు మున్సిపాలిటీలలో నిరుపయోగంగా పడి ఉన్నాయన్నారు. జీతాల నుంచి మినహాయించే సొమ్ము వారి ఖాతాలకు జమచేసేందుకు కానీ ఖాతాలలో ఉన్న సొమ్ము అవసరాలకు వినియోగించుకునేందుకు కానీ అవకాశం లేకుండా పోయిందన్నారు. దీక్షలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ మెంబరు రామకృష్ణనాయక్, ధర్మవరం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు హరికృష్ణ, సాయిగణేశ్, నాయకులు లక్ష్మయ్య, రాంప్రసాద్, రామాంజినేయులు, అంజనేయులు పాల్గొన్నారు.

చోరీపై కేసు నమోదు

గోరంట్ల, అక్టోబరు 2: మండలంలోని నాసిన్ కంపెనీలో విలువైన గుజరి సామగ్రి చోరీ చేసి, తరలిస్తుండగా పట్టుకుని బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. బోలేరా, గూడ్సు వాహనంతోపాటు రూ.5.20 లక్షల విలువ చేసే అల్యూమినియం, ఐరన్ తదితర వస్తువులు తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని శివకుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు చెప్పారు. హిందూపురంలోని పరిగి రోడ్డులో ఉంటున్న శివకుమార్ కొంతకాలంగా పాలసముద్రం సమీపంలోని నాసిన్ కంపెనీలో ఇద్దరు బిహార్ రాష్ట్రానికి చెందిన పనివారి సహకారంతో ప్రహరీగోడ బయటకు గుజరీని తెప్పించేవాడని, అక్కడి నుంచి గూడ్స్ వాహనంలో తీసుకెళ్లి విక్రయించేవాడని తెలిపారు. డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు మేనేజర్ పవన్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కేవీపీఎస్ జెండా ఆవిష్కరణ

హిందూపురం(సోమందేపల్లి), అక్టోబరు 2 : మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో బుధవారం కేవీపీఎస్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అన్నమయ్య మాట్లాడుతూ దళితుల సమానత్వం కోసం 1998అక్టోబరు2న కేవీపీఎస్ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ అనేక విజయాలను సాధించామన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ జస్టిస్ పున్నయ్య సిఫార్సులు, దళిత శ్మశాన వాటికలతో పాటు అనేకంగా సాధించామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశులు, రామాంజనేయులు, బాబు, రవి, ఆనంద్, నరసింహులు, ఆనందప్ప, రాము, రవి పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపు

రొళ్ల, అక్టోబరు 2 : మండలంలోని గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహించారు. రొళ్ల, రత్నగిరి, బి.జి.హళ్లి, మల్లినమడుగు, కాకి, గుడ్డగురికి గ్రామ పంచాయతీల లో గ్రామ సర్పంచు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శిల చేత గ్రామసభలు జరిగాయి. గ్రామసభలకు సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధి కూలీలు, ఉపాధి సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొని 2024-2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన ఉపాధి పనులను గుర్తించారు.

నేడు సోమందేపల్లిలో..

సోమందేపల్లి : మండలంలో గురువారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 16 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. బుధవారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉపాధిహామీ పనుల ఎంపిక, పంచాయతీల అభివృద్ధి స్వచ్ఛతా హీసేవ, చెత్తతో సంపద కార్యక్రమాలపై గ్రామసభలు ఉంటాయన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

గోరంట్ల, అక్టోబరు 2: భవన నిర్మాణ కార్మికుల సమస్యల సాధనకోసం ఈనెల 4న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం కన్వీనర్ కొండా వెంకటేష్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. గోరంట్ల సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు స్వర్ణలత, నాగరాజు, శ్రీనివాసులు, సురేష్, రామాంజి, లోకేష్ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద
తయారీ కేంద్రం ప్రారంభం

ముదిగుబ్బ, అక్టోబరు 2: స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ బుధవారం ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి కృష్ణకుమార్, పంచాయతీ కార్యదర్శి మంజుల, సర్పంచ్ లక్ష్మీదేవి చంద్రాయుడు, నాయకులు గణపర్తి రమేష్, కృష్ణమూర్తి యాదవ్, ఓబిరెడ్డి, అమీర్, రాము పాల్గొన్నారు.

జపానంద స్వామి సేవలు ఆదర్శనీయం

పావగడ, అక్టోబరు 2: దేశంలోని పలు రాష్ట్రాల పేదలకు 30 సంవత్సరాల నుంచి రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి చేస్తున్న సేవలు ఆదర్శనీయమని పావగడ మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి మాదేశ్ కొనియాడారు. బుధవారం పట్టణంలోని రామకృష్ణ సేవాశ్రమంలో కుష్టు రోగుల కు దసరా సందర్భంగా నిత్యావసర సరుకుల కిట్లను అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పేదలు, బాధితులకు జపానందస్వామి చేస్తున్న సేవలు ఆదర్శనీయమని అన్నారు. అనంతరం జపానందస్వామి మాట్లాడుతూ కుష్టురోగుల సేవలు భగవంతుడి సేవలుగా భావించి వారికి అవసరమైన నిత్యాసవర సరుకుల కిట్లు, వస్త్రాలను అందజేశామన్నారు. 9 మంది వికలాంగులకు రెడీమేడ్ వీల్‌చెయిర్లు, ఇతర పరికరాలను అందింమన్నారు. ప్రతినెలా ఆహారధాన్యాలు అందించడానికి సహకరించి ఇన్ఫోసిస్ సంస్థకు తాను ఎంతో రుణపడి ఉంటానని స్వామిజీ తెలిపారు.



సరుకుల కిట్లను పంపిణీ చేస్తున్న న్యాయాధికారి మాదేశ్, జపానందస్వామి

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

హిందూపురం, అక్టోబరు 2 : ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఈఈ భూపతి పేర్కొన్నారు. బుధవారం సదాశివనగర్‌లో నరసింహమూర్తి ఇంటిపై మూడు కిలోవాట్ల సన్‌మిత్ర సన్‌టెక్ సోలార్ సిస్టంను ప్రారంభించారు. విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేసి అనంతరం ప్రారంభించి ఈఈ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంతో ఎంతో ఉపయోగకరమన్నారు. ఇంటి పైకప్పుపై సోలార్‌ప్లాంట్ అమర్చి మీకు ఎంత వినియోగించుకుంటారో మిగిలిన దానిని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఇప్పటికే నీరు, బొగ్గు ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా మానవుడి మేధాశక్తితో గాలి, వెలుతురు ద్వారా సోలార్ సిస్టంతో విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఏర్పడిందన్నారు. దీనివల్ల విద్యుత్ ఇబ్బందులు ఉండవన్నారు. ప్రజలకు కూడా ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ పీఎం సూర్యఘర్ రాయలసీమ జోన్ నోడల్ అధికారి, ట్రాన్స్‌కో ఏడీఈ నాగన్న, స్థానిక నోడల్ అధికారి విష్ణు, లక్ష్మీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సోలార్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి: సీఐటీయూ

ధర్మవరం, అక్టోబరు 2 : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధ వారం నిరసన ర్యాలీ నిర్వహించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని విజయవాడలో చేస్తున్న దీక్షలకు మద్దతుగా ర్యాలీని సీఐటీయూ కార్యాలయం నుంచి కళాజ్యోతి సర్కిల్ వరకు చేపట్టారు. అక్కడ నిరసన చేపట్టారు. ఈ సంద ర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ మాట్లాడుతూ... విశాఖ ఉక్కు కోసం అనేక రకాలుగా పోరాటాలు కొనసాగించి సాధించు కున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చేయడానికి అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో 75 లక్షల టన్నులు ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉన్నా.. కేవలం 25 లక్షల టన్నులు మాత్రమే చేయడానికి ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. ఈ కార్యక్ర మంలో రైతుసంఘం జిల్లా నాయకులు జంగాల పల్లి పెద్దన్న, సీఐటీయూ మండల కో-కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఎల్‌ఆదినారాయణ, సీపీఎం నాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీపీఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి పాల్గొన్నారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

పెనుకొండ, అక్టోబరు 2 : దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయి. ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని ప్రాచీనమైన లక్ష్మీ వెంకటరమణస్వామి, వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయాలలో తొమ్మిది రోజులపాటు ప్రతిరోజూ స్వామివారిని ఒక్కో రూపంలో అలంకరిస్తారు. ఆఖరి రోజు పట్టణంలోని అన్ని ఆలయాల ఉత్సవ విగ్రహాలను జంబు సవారీ పేరిట ఊరేగించడం ఆనవాయితీగా వస్తోంది.



లక్ష్మీవెంకటరమణస్వామి ఆలయం

వరద బాధితులకు సాయం



మంత్రికి చెక్కును అందిస్తున్న డ్వాక్రాసంఘాల మహిళలు

పెనుకొండ టౌన్, అక్టోబరు 2: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైన విజయవాడ వరద బాధితుల కోసం పెనుకొండకు చెందిన డ్వాక్రా సంఘాలు రూ.1.50 లక్షలు బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు అందజేశారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా పెనుకొండకు చెందిన ప్రగతి, రేవతి, బాబాఫక్రుద్దీన్, దాదాపీర్, బాబా, అరుంధతి, శ్రీలక్ష్మీ, మహిళా సంఘాల సభ్యులు కలిసి ఈ చెక్కును అందించారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

చిలమత్తూరు, అక్టోబరు 2: తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మార్క్ ఆసుపత్రి సహకారంతో బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజలు నుంచి విశేష స్పందన లభించింది. టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి, నాయకుడు నాగేంద్ర పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరానికి గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. గుండె సంబంధింత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించారు. శిబిరంలో 230 మంది వరకు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు నాగరాజు, మహేష్, సిబ్బంది పూజిత, దుర్గావతి, భాగ్యలక్ష్మి, నాయకులు నందీశప్ప, అశ్వర్థప్ప పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

నిధుల్లేక నిలిచిన భవనాలు

- మొండిగోడల్లోనే నాడు-నేడు పనులు
- నిధులు విడుదల చేయని గత పాలకులు

మడకశిర రూరల్, అక్టోబరు 2: వైసీపీ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేసిందని నాటి పాలకులు గొప్పలు చెప్పుకున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. ఆ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నాడు-నేడు పాఠశాల భవన నిర్మాణాలకు నిధులు లేక అర్ధంతరంగా ఆగిపోయి రెండేళ్లుగా మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 118 ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు రెండో ఫేజ్ కింద మండలంలో 61 పాఠశాలల భవన నిర్మాణాలు చేపట్టారు. మంజూరు చేసిన నిధుల్లోనే సిమెంట్, ఎలక్ట్రికల్ పరికరాల మొత్తాన్ని ప్రభుత్వం కోత విధించింది. మిగిలిన నిధులు పాఠశాలకు పంపించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన మొత్తంలో పనులు ప్రారంభించారు. కొన్ని పాఠశాల్లో స్థల సమస్య కారణంగా పాఠశాల పైభాగంలో నిర్మాణాలు చేశారు. మరికొన్ని చోట్ల పాత భవనాలను తొగించారు. భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పెండింగ్‌లో ఉన్న భవనాలను పూర్తి చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అమిదాలగొంది ఉన్నత పాఠశాలలో దర్శనమిస్తున్న మొండిగోడలు

నిధుల కొరతతోనే నిలిచిపోయాయి
- భాస్కర్, ఎంఈఓ



మడకశిర మండలంలో రెండో విడతలో చేపట్టిన నాడు-నేడు పనులు నిధుల కొరత కారణంగానే ఆగిపోయాయి. భవనాలకు సంబంధించి సిమెంట్, ఎలక్ట్రికల్ పరికరాలకు కావలసిన నిధులు ప్రభుత్వం పట్టుకుని వాటిని సరఫరా చేసింది. చేసిన పనులకు కూడా నిధులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయాయి. రెండేళ్లుగా పాఠశాల నిర్వహణ నిధులు కూడా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.